క్లుప్తంగా

ముచ్చట్ల మల్లికార్జున స్వామి ఆలయంలో పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

డోన్ : బేతంచెర్ల మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామ సమీపాన వెలసిన ముచ్చట్ల భ్రమరాంభ, మల్లికార్జునస్వామి ఆలయంలో వైశాఖ మాసం సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ముచ్చట్ల భ్రమరాంబా, మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకు మార్చన, మహామంగళ హారతి నిర్వహించారు.

ట్యాంకర్లతో తాగునీటి సరఫరా



ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలో ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు సర్పంచ్ శివరాముడు సోమవారం తెలిపారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలాలు తగ్గిపోయాయి. గ్రామంలో మంచినీటి సమస్య నెలకొనడంతో ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పలు వీధులకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఇందుకు రామ్‌కో సిమెంట్ కంపెనీ సామాజిక కార్యక్రమంలో భాగంగా చేదోడుగా నిలిచిందన్నారు. పంచాయతీ నుంచి రెండు, రామ్‌కో నుంచి ఒక ట్యాంకర్‌తో ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటిని అందిస్తున్నామన్నారు.

మహిళాభ్యున్నతికి వీరేశలింగం పంతులు కృషి ఎనలేనిది



వీరేశలింగం పంతులు చిత్ర పటానికి పూల మాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్ : మహిళల అభివృద్ధి కొసం కందుకూరి వీరేశలింగం పతులు ఎనలేని కృషి చేశారని జేకేఆర్ సంక్షేమ సంఘం సంఘ అధ్యక్షుడు జెఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి అన్నారు. సోమవారం మండలంలోని పలుకూరు గ్రామంలో కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కందుకూరి వీరేశలింగం పంతులు బాల్య వివాహాల నిర్మూలనకు, వింతంతు వివాహాలను ప్రోత్సహించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు కేతు వెంకట సుబ్బయ్యగౌడ్, సుధాకర్‌గౌడ్, భాస్కర్, జావిద్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి



హుసేనాపురంలో టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

ప్యాపిలి: పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశువైద్యాధికారి విద్యాసాగర్ అన్నారు. మండల పరిధిలోని గార్లదిన్నె, గుడిపాడు, హుసేనాపురం, మాధవరం, ఊటకొండ గ్రామాల్లో సోమవారం పశువైద్య సిబ్బంది పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున పశువులకు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. టీకాలు వేయించడం ద్వారా గాలికుంటు, జబ్బ వాపు వ్యాధిని అరికట్టవచ్చన్నారు. మంగళవారం ఎన్ రంగాపురం, వెంకటాంపల్లి, నల్లమేకలపల్లి, డి.రంగాపురం గ్రామాల్లో టీకాలు వేయనున్నట్లు ఆయన తెలిపారు. పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆర్బీకేలకు 12వేల మెట్రిక్ టన్నుల ఎరువులు

బనగానపల్లె: మండలంలోని 25 ఆర్‌బీకేలకు ఖరీఫ్ సీజన్‌కు గాను 12వేల మెట్రిక్ టన్నుల ఎరువులు మంజూరయ్యాయని మండల వ్యసాయాధికారి సుబ్బారెడ్డి తెలిపారు. గత పది రోజులుగా మండలంలో అన్ని ప్రాంతాల్లో కురిసిన వర్షాలు పంటల సాగుకు ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. జూన్ 1 నుంచి మండలంలో మొక్కజొన్న, కంది, పత్తి, మినుము, కొర్ర వేరుశనగ పంటలను రైతులు సాగు చేసే అవకాశం ఉందని చెప్పారు. ప్రస్తుతం ఆర్‌బీకేల్లో 35–40 మెట్రిక్ టన్నుల ఎరువులు నిల్వ ఉన్నాయన్నారు. అలాగే మండలానికి 110 క్వింటాళ్ల జిలుగ విత్తనాలు సరఫరా అయ్యాయని, 50 శాతం సబ్సిడీపై కిలో రూ.44లు చెల్లించి ప్రతి రైతు 50 కిలోల వరకు పొందవచ్చన్నారు.

విత్తన ఎంపికలో పొరపాటు.. దిగుబడికి చేటు!

- విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు తప్పనిసరి
- నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడి
- చీడపీడల నివారణ కూడా



యాగంటి కృషివిజ్ఞాన కేంద్రంలో అందుబాటులో ఉన్న వరివిత్తనాలు



కంది విత్తన ప్యాకెట్లు

బనగానపల్లె రూరల్ : పంటల సాగులో విత్తన ఎంపికే అంత్యంత కీలకం. విత్తన ఎంపికే పంటల దశ దిశ మార్చుచేస్తుంది. నాణ్యమైన విత్తనాన్ని ఎంపిక చేసుకుంటే దిగుబడితో పాటు చీడపీడల నివారణ కూడా సులువుగా ఉంటుంది. కావున రైతన్నలు విత్తన ఎంపిక, కోనుగోలులో ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

ఖరీఫ్‌కు రైతన్నలు సిద్ధం

జిల్లా వ్యాప్తంగా ముందస్తు వర్షాలు కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దీంతో రైతులు ఖరీఫ్‌కు సిద్ధమవుతున్నారు. చాల మంది రైతులు దుక్కిసేద్యాలు కూడా చేసుకుంటున్నారు. ప్రభుత్వం పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగలను సబ్సిడీపై పంపిణీ చేస్తోంది. ఇప్పటికే బోరుబావులు ఉన్న రైతులు వరి నారుసాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా రైతులు ఎక్కడ బడితే అక్కడ విత్తనాలు కోనుగోలు చేస్తుంటారు. విత్తనాలు కోనుగోలు చేసిన తరువాత చాల మంది రైతులు బిల్లులు కూడా షాపు యజమాని నుంచి తీసుకోవడంలేదు.

విత్తన ఎంపికే కీలకం..

విత్తన ఎంపికలో ఏదైన పొరపాటు జరిగితే దిగుబడు లు తగ్గి రైతు తీవ్రంగా నష్టపోయ్యే ప్రమాదం ఉంది. ఈ నైపథ్యంలో రైతులు విత్తన ఎంపికలో అప్రమత్తంగా ఉండాలని, విత్తన ఎంపిక దిగుబడులను నిర్ణయిస్తుందని, అలాగే చీడపీడల నివారణ కూడా సులువుగా ఉంటుందని ఏఓ సుబ్బారెడ్డి తెలిపారు.గ్రామ స్థాయిలో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో లేదా కృషి విజ్ఞాన కేంద్రాల్లో విక్రయించే సర్టిఫైడ్ విత్తనాలనే కోనుగోలు చేయాలని సూచించారు. విత్తన ఎంపికలో రైతులు పాటించాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.

విత్తన ఎంపిక ఇలా..

- రైతులు విత్తన ఎంపికలో వ్యవసాయశాఖ నుంచి అనుమతి పొందిన అధీకృత డీలర్ల నుంచి మాత్రమే విత్తనం కొనుగోలు చేయాలి.
- బిల్లుపై విక్రయదారుడి పేరు, రాష్ట్రం అమ్మకపు పన్ను నంబరు, చివరి గడువు తేదీ, కంపెనీ పేరు, డీలర్ సంతకం ఉండేలా జాగ్రత్తలు పాటించాలి.
- విత్తనాలు కొనుగోలు చేసిన తరువాత డీలర్ వద్ద తీసుకున్న బిల్లులను రైతులు తమ పంట కాలం పూర్తయ్యేవరకు భద్రంగా దాచుకోవాలి.
- విత్తన ప్యాకెట్ల సంచి పైన సీల్ ఉందా లేదా అని చెక్ చేసుకోవాలి.
- లూజు విత్తనాలు, గడువుదాటిన విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ కోనుగోలు చేయరాదు.
- విత్తనం కోనుగోలు చేసిన వెంటనే పరీక్షించాలి, మొకలశాతం సంతృప్తిగా ఉన్న వాటిని ఎంపిక చేసుకోవాలి.
- మొలకెత్తే సమయంలో పూతదశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయాధికారిని సంప్రదించాలి.
- విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు విక్రయదారుడు ఇచ్చే కర పత్రాలను తీసుకొని వాటిలో

మొలకశాతం పరీక్షించుకోవాలి



రైతులు ఎవరైన విత్తనాలు బయట కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు వస్తే లైసెన్స్‌లు ఉన్న డీలర్ల వద్దనే కోనుగోలు చేయాలి. కొనుగోలుకు సంబంధించిన బిల్లులను కచ్చితంగా తీసుకోవాలి. విత్తనాల మొలక శాతం చెక్ చేసుకోవాలి. మొలక శాతం తక్కువగా ఉంటే కొనుగోలు చేయరాదు. ధర నాణ్యత విషయంలో రైతులకు ఎలాంటి అనుమానం ఉన్నా సంబంధింత బిల్లుతో వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేయాలి.

–సుబ్బారెడ్డి, మండల వ్యసాయాధికారి, బనగానపల్లె

ఎమ్మార్సీకి చేరిన పాఠ్యపుస్తకాలు

ప్యాపిలి: పాఠశాలలు పునఃప్రారంభం అయిన రోజునే విద్యార్థులకు విద్యాకానుక అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. మండలానికి 56 వేల పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉండగా మొదటి విడతలో 7,592 పాఠ్యపుస్తకాలు చేరినట్లు ఎంఈఓ వెంకటేశ్ నాయక్ సోమవారం తెలిపారు. మిగిలిన పుస్తకాలు, నోటు పుస్తకాలు త్వరలోనే వస్తాయని ఆయన అన్నారు. పాఠశాలలు తెరిచే నాటికి అన్ని పుస్తకాలు, విద్యాకానుక కిట్లు వస్తాయని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 12న పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు.

వేరుకుళ్లుపై జాగ్రత్తలు పాటించాలి

కొలిమిగుండ్ల: చీని, నిమ్మ చెట్లకు సోకుతున్న వేరుకుళ్లు తెగులుపై రైతులు జాగ్రత్తలు పాటించాలని ఉద్యాన శాఖాధికారిణి ధరణి సూచించారు. సోమవారం కొలిమిగుండ్లలో పలు తోటల్లో వేరుకుళ్లు తెగులు సోకిన చీనీ చెట్లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతు వేరుకుళ్లు తెగులు వలన వేర్లు కుళ్లి పోషక పదార్థాలు, నీరు చెట్టుకు అందకుండా పోవడంతో చెట్లు ఎండిపోతాయన్నారు. వేర్లు పరిశీలిస్తే కుళ్లిన వాసనను గమనించవచ్చని చెప్పారు. వ్యాధి సోకిన తొలి దశలోనే గమనించి చెట్టుకు నీరు కట్టి మరుసటి రోజు కార్బండాజిమ్ రెండు గ్రాములు లేదా మాంకో జెబ్ మూడు గ్రాములు లీటరు నీటిలో కలిపి చెట్ల పాదుల్లో నేల తడిచేలా చేయాలి. సేంద్రీయ ఎరువులు, పచ్చిరొట్టె ఎరువులు ఎక్కువగా వాడాలని సూచించారు. ఒక కిలో యూరియా వంద లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.

విజయోత్సవ ర్యాలీలు నిషేధం



బనగానపల్లెలో మాక్‌డ్రిల్‌లో అల్లరి మూకలపై కాల్పులు జరుపుతున్న కేంద్ర బలగాలు



కోవెలకుంట్లలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

కోవెలకుంట్ల: వచ్చే నెల 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో విజయోత్సవ ర్యాలీలు, ఉత్సవాలు, సంబరాలు, ఊరేగింపులు నిషేధమని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తెలిపారు. సోమవారం కోవెలకుంట్ల పట్టణంలోని జమ్మలమడుగు చౌరస్తా నుంచి ముదిగేడు టర్నింగ్ వరకు ఏఎస్పీ ప్రవీణ్ కుమార్, ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల, ఆళ్లగడ్డ రూరల్ సీఐలు జయచంద్ర, గోపీనాథ్‌రెడ్డి, హనుమంతనాయక్, చంద్రబాబుతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో అల్లర్లు, గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున సామాన్య ప్రజలు, నాయకులు కౌంటింగ్ జరిగే ప్రదేశానికి వెళ్లకూడదన్నారు. 30 పోలీస్ యాక్ట్, 144 సెక్షన్ అమల్లో ఉన్నందున నలుగురు, అంతకంటే ఎక్కువమంది ఒకే చోట గుమికూడి ఉండరాదన్నారు. కౌంటింగ్ రోజున అభ్యర్థి, అభ్యర్థి తరుపున ఏజెంట్లు తప్ప మిగిలిన వారికి అనుమతి లేదన్నారు. కౌంటింగ్ రోజున టపాసులు కాల్చడం, డ్రమ్ములు కొట్టడం, డీజేలు, కేక్‌లు, తదితర వాటికి అనుమతి లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సర్కిల్ ఎస్ఐలు వరప్రసాద్, రాజ్‌కుమార్, రమేష్‌రెడ్డి, రాంమోహన్‌రెడ్డి, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

కౌటింగ్ పూర్తయ్యేంత వరకూ ఎన్నికల ప్రవర్తన నియమావళి..

బనగానపల్లె రూరల్ : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యేంత వరకూ జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం బనగానపల్లెలోని పెట్రోల్ బంకు కూడలిలో పోలీసు మాక్ డ్రిల్ ప్రదర్శించారు. ఎస్పీ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు రోజున ప్రజల శాంతి భద్రతలు, ఆస్తుల పరిరక్షణ విషయంలో ఎలాంటి పరిస్థితులు, సవాళ్లు ఎదురైనా, వాటిని అధిగమించేందుకు పోలీసులు ఇప్పటికే సమయత్తమయ్యారని చెప్పారు. ఈ సందేశాన్ని ప్రజలకు తెలియజేసేందుకు మాక్‌డ్రిల్ ప్రదర్శన నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, బనగానపల్లె సీఐలు గంటా శ్రీనివాసరావు, తిమ్మారెడ్డి, ఎస్ఐలు కేంద్ర ఆర్మీ బలగాలు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవుడి రథోత్సవం



రథంలో కొలువైన శ్రీ భూలక్ష్మి సమేత చెన్నకేశవ స్వామి

అవుకు: మండల కేంద్రం అవుకులో తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా శ్రీ భూలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి రథోత్సవం (తేరు వెనుకకు లాగుట) సోమవారం వైభవంగా సాగింది. రథోత్సవంలో భాగంగా ఆదివారం తేరువీధి నుంచి మండపం వీధికి వచ్చిన ఉత్సవమూర్తులను చేర్చారు. సోమవారం తిరుగు ప్రయాణంగా మండపం వీధి నుంచి రాజా వీధి మీదుగా తేరువీధి వరకు అంగరంగా వైభవంగా రథోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన చెక్కభజన కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



కాలనీలో పర్యటిస్తున్న కమిషనర్ జయరామ్

డోన్ టౌన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అంటు వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరామ్ సూచించారు. సోమవారం 18వ వార్డులో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలతో మాట్లాడుతూ నీటిని నిల్వ ఉంచుకోవడం వల్ల దోమలు వ్యాప్తి చెంది టైఫాయిడ్, మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద నిర్మించిన సులభ కాంప్లెక్స్‌ను తనిఖీ చేశారు. ఆయన వెంట మున్సిపల్ ఇంజినీర్ సురేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహ్మద్‌బాషా పాల్గొన్నారు.

పేదల భద్రత ప్రభుత్వ లక్ష్యం



టార్పాలిన్లు అందజేస్తున్న ఆర్డీఓ మహేశ్వరరెడ్డి

డోన్ టౌన్: పేదల సంక్షేమం, భద్రత ప్రభుత్వ లక్ష్యమని ఆర్డీఓ మహేశ్వరరెడ్డి అన్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పట్టణ శివార్లలో నివసిస్తున్న బుడగ జంగాల కాలనీల్లో కోల్పోయిన వారికి సోమవారం టార్పాలిన్లు అందజేశారు. కార్యక్రమంలో డోన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు కొచ్చెర్వు వెంకటేశ్వర్లు, సామాజిక కార్యకర్త మహ్మద్‌రఫీ, బాలసుబ్బయ్య, ప్రవీణ్‌కుమార్, చాంద్, రఘు పాల్గొన్నారు.

సత్తా చాటిన సత్యసాయి జిల్లా వృషభాలు



రాతిదూలం లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న కర్రా హర్షవర్ధన్‌రెడ్డి

కోవెలకుంట్ల: పట్టణంలోని రంగరాజుపేటలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి రాతిదూలం లాగుడు పోటీల్లో సత్యసాయి జిల్లా వృషభాలు సత్తా చాటాయి. పాలపండ్ల విభాగంలో నిర్వహించిన పోటీల్లో జిల్లాతోపాటు కర్నూలు, అనంతపురం, సత్యసాయి, వైఎస్సార్ జిల్లాలకు చెందిన ఏడు జతల వృషభాలు పోటీల్లో పాల్గొన్నాయి. పోటీలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్ధన్ రెడ్డి ప్రారంభించారు. సత్యసాయి జిల్లా సీకేపల్లికి చెందిన భాస్కర్‌రెడ్డి వృషభాలు ప్రథమ స్థానంలో నిలిచి రూ. 50 వేలు కైవసం చేసుకున్నాయి. నంద్యాల జిల్లా ఏ కోడూరుకు చెందిన నాగమల్లేశ్వర రెడ్డి ఎద్దులు రెండవ స్థానంలో రూ. 40వేలు, వైఎస్సార్ జిల్లా దాసరిపల్లె చిన్న వీరన్న వృషభాలు మూడవ స్థానంలో రూ. 30వేలు దక్కించుకున్నాయి. అనంతపురం జిల్లా క్రోసూరుకు చెందిన వెంకటరెడ్డి ఎద్దు, కోవెలకుంట్లకు చెందిన మధుసూదన్‌రెడ్డి వృషభాలు ఐదవస్థానంలో రూ. 10వేలు గెలుపొందాయి.

మిగిలిన సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

కోవెలకుంట్ల: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి ప్రవేశానికి మిగిలిన సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కోవెలకుంట్ల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సౌభాగ్యలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 29న కర్నూలు సమీపంలోని దిన్నెదేవరపాడు పాఠశాలలో ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. బాలికల విభాగంలో ప్రవేశ పరీక్షలో ఎస్సీ కేటగిరిలో 19 మార్కులు, ఎస్టీ 19, బీసీ 41, ఓసీ 40 మార్కులకు పైగా సాధించిన విద్యార్థినులు మాత్రమే హాజరు కావాలని సూచించారు.

మహిళ అదృశ్యం

కోవెలకుంట్ల: స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయ సమీపంలో నివాసం ఉంటున్న ఓ వివాహిత అదృశ్యమైనట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. సోమవారం ఎస్ఐ తెలిపిన సమాచారం మేరకు.. కాలనీకి చెందిన రమణమ్మ అనే మహిళ ఆదివారం పట్టణంలోని పాండురంగస్వామి తిరునాలకు వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. రాత్రి అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. తల్లి వెంకటలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఉమామహేశ్వరస్వామికి పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి పల్లకీ సేవ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఉదయం ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ తొటబుచ్చిరెడ్డిల ఆధ్వర్యంలో ఆలయంలో ఏక శిలారూపంలో కొలువైన శ్రీశివపార్వతులకు అభిషేకం, అర్చన తదితర పూజలు చేశారు. సాయంత్రం శ్రీ ఉమామహేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

డోన్ టౌన్: ఆధ్యాత్మికతో మానసిక ప్రశాంతత సాధ్యమని గీతా యోగాసన సంఘం గురూజీ రాంపుల్లయ్య సూచించారు. సోమవారం పట్టణ సమీపంలోని కొండపై వెలసిన తిరుమల వీరాంజనేయ స్వామి సన్నిధిలో యోగా బృందం సభ్యులచే భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు భజన చేస్తూ దేవుని పాటలు కీర్తించారు. ఈ సందర్భంగా గురుజీ మాట్లాడుతూ యోగాతోపాటు ఆధ్యాత్మిక చింతన అలవరుచుకోవాలని సూచించారు.

పశువైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి



మాట్లడుతున్న ఏడీ డాక్టర్ మోహన్ రావు

సంజామల: పశువులుకు మెరుగైన వైద్యం అందించడంలో ఎక్కడా రాజీ పడొద్దని, పాడిరైతులకు సిబ్బంది అందుబాటులో ఉండాలని ఏడీ డాక్టర్ మెహన్ రావు సూచించారు. మండల కేంద్రం సంజామల ఏరియా పశువైద్యశాలలో సోమవారం సంజామల, కొలిమిగుండ్ల మండలాల పారా వెట్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఏడీ మాట్లడుతూ.. ఎప్పటికప్పుడు సీజనల్ వ్యాధులకు సంబంధించిన సమాచారం రైతులకు తెలియజేసి అప్రమత్తం చేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ రఘుబాల కృష్ణ, డాక్టర్ శివనంద, డాక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రేపు మధ్యాహ్న భోజన నిర్వాహకులతో సమావేశం

ప్యాపిలి: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వాహకులతో ఈనెల 29న సమావేశం నిర్వహించనున్నట్లు ఎంఈఓ వెంకటేశ్ నాయక్ సోమవారం తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమావేశం ఉంటుందన్నారు.

ఆట విడుపు





బేతంచెర్ల పట్టణంలోని అంగళ్ల బజారుకు ప్రత్యేకత ఉంది. అక్కడకు పట్టణ ప్రజలతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలు సైతం నిత్యావసర సరుకుల కోసం వస్తుంటారు. అంగళ్ల బజారు వీధిలో పెద్ద వేప చెట్టు కింద రచ్చ కట్ట ఉంది. అక్కడకు వచ్చే పట్టణ ప్రజలు, గ్రామీణ ప్రాంత ప్రజలు వేసవి కాలంతో సంబంధం లేకుండా కాలక్షేపం కోసం పులిగీతం ఆడుతుంటారు. నేటి యువత ఫోన్‌లో మునిగి తేలుతుండగా నాటి తరం పెద్దలు మాత్రం పులిగీతం ఆటతో సేదతీరుతున్నారు. – డోన్

రైతులను మోసం చేసే వారిపై చర్యలు తీసుకోండి

డోన్ రూరల్: రైతులను మోసం చేసే ఫర్టిలైజర్ షాపుల యాజమానులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు సోమవారం ఏఓ అబ్దుల్‌షఫీ, ఆర్‌డీఓ మహేశ్వరరెడ్డిలకు వినతి పత్రాలు ఇచ్చారు. పట్టణంలోని పలు దుకాణాల్లో నాసిరకం విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తూ రైతులను మోసం చేస్తున్నారని సీపీఐ మండల కార్యదర్శి పులిశేఖర్, మండల సహాయ కార్యదర్శి వరదరాజులు, బి.రంగస్వామి, ఏఐవైఎఫ్ నాయకులు రంగస్వామి, కె.రాఘవేంద్ర, కొడయ్య తదితరులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు

డోన్: శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తప్పవని బేతంచెర్ల ఎస్ఐ శివ శంకర్ నాయక్ అన్నారు. బేతంచెర్ల మండల పరిధిలోని గూటుపల్లె, రహిమానుపురం గ్రామాల్లో ఆయన సోమవారం పర్యటించి ఆయా గ్రామస్తులతో మాట్లాడారు. జూన్ 4న ఎన్నికల ఫలితాల సందర్భంగా ఎలాంటి గొడవలకు పాల్పడవద్దన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉండటంతో ఊరేగింపులు, ర్యాలీలు నిషేధమన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



గూటుపల్లె గ్రామంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ శివశంకర్

పేర్లు నమోదు చేసుకోండి

డోన్ : ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో అందజేసే వేరుశనగ విత్తనాల కోసం రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని బేతంచెర్ల ఏఓ కిరణ్ కుమార్ సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కే6, కదిరి లేపాక్షి, టీసీజీఎస్ 1694 రకాల వేరుశనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కావాల్సిన రైతులు ఆర్‌బీకేల్లో సంప్రదించాలన్నారు.

గురుకులంలో మిగిలిన సీట్లకు నేడు, రేపు కౌన్సెలింగ్

డోన్ టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో మిగిలిపోయిన సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డోన్ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలురకు మంగళవారం చిన్నటేకూరు, బుధవారం బాలికలకు సబంధించి దిన్నెదేవరపాడు గ్రామాల్లోని గురుకుల పాఠశాల్లో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రవేశ పరీక్షల్లో 22 మార్కులకు పైగా వచ్చిన బాలురకు ఎస్సీ 22, ఎస్టీ 25, బీసీ 45, ఓసీ 44 మార్కులపైన సాధించిన వారు కౌన్సిలింగ్‌కు హాజరుకావాలన్నారు. బాలికలకు ఎస్సీ–19, ఎస్టీ–19, బీసీ–41, ఓసీ–40 పైన మార్కులు వచ్చిన వారు మాత్రమే హాజరుకావాలన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
డోన్, బనగానపల్లె
90100 55532 (డోన్)
99122 20581 (బనగానపల్లె)
Office mail : sakshiknladvt@gmail.com